నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, శుక్రవారం 15 మార్చి 2024 | NALGONDA



ఆలయ మాఢ వీధుల్లో వట పత్రశాయి అలంకారంలో స్వామి వారి ఊరేగింపు

# హంస వాహనంపై యాదగిరీశుడు

## ఉదయం వటపత్రశాయి అలంకారంలో దర్శనమిచ్చిన స్వామివారు

## నాలుగో రోజుకు చేరిన బ్రహ్మోత్సవాలు



హంస వాహనంపై లక్ష్మీనరసింహ స్వామి

యాదగిరిగుట్ట, మార్చి14 : ఉదయం వటపత్రశాయిగా, రాత్రి హంస వాహన సేవలో లక్ష్మీ నరసింహ స్వామి మహాద్భుత దర్శనభాగ్యం భక్తులకు కలిగింది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నాలుగు రోజులుగా ఏకకుండాత్మక, నావాహ్నిక, పాంచరాత్రాగమ శాస్త్ర రీతిలో జరుగుతున్నాయి. ప్రధానాలయంలో గురువారం వేకువజామున ద్వారతోరణ పూజ, ధ్వజ కుంభారాధన, అగ్ని ఆరాధన, మూల మంత్ర, పంచసూక్త హవనం తదితర పూజలను ఆలయ ప్రధానార్చకులు, యాజ్ఞికులు, రుత్వికులు, పారాయణందారులు నిర్వహించారు. అనంతరం ఉదయం 9.00 గంటలకు స్వామివారిని వంటపత్రశాయి అలంకారంలో ప్రత్యేక పల్లకిపై అధిష్టించారు. రుత్వికులు, వేదపండితులు స్వామివారి అలంకార సేవ ముందు దివ్య ప్రబంధ వేద పారాయణాలు, మూల మంత్ర జప పఠనాలు గావించారు. అనంతరం డోలు సన్నాయి, మేళాలతో స్వామివారిని ప్రధానాలయ తిరు మాఢ వీధుల్లో ఊరేగించారు. అంతకుముందు స్వామి వారిని తూర్పు మాఢవీధుల్లో ప్రత్యేక వేంచేపు మండపంలో ఆస్థానం చేసి ప్రధానార్చకులు వటపత్రశాయి విశిష్టతను భక్తుల వినిపించారు.

### మహా విష్ణువు ధరించిన అద్భుత రూపమే వటపత్రశాయి

సృష్టి ఆదిలో మహావిష్ణువు ధరించిన అద్భుత రూపమే వటపత్రశాయి అలంకారం. మహాకల్ప ముందు ప్రపంచమంతా జలమయమై, అంధకారమై ఉన్న సమయంలో భగవానుడు మర్రి ఆకుపై పవళించి తన గర్భంలోని లోకాలన్నింటికీ తన పాదారవిందం చేత అమృతాన్ని అందిస్తూ కాపాడిన శ్రీమన్నారాయణ తత్వం ఈ అలంకార సేవలో దర్శించవచ్చని ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు.

'కరారవిందేన పదారవిందం..పదారవిందం ముఖారవిందేనె విని వేశయంతు వటస్య పత్రస్య సుఖేశయానం.. బాల ముకుందం మనసాస్మరామి' అని మహాభాగవతంలో వటపత్రశాయి గురించి చెప్పిన విషయాలను ఆయన వివరించారు. ఈ లీలలో సమస్త చరాచర సృష్టి మండలాన్ని నిర్మించే తీరు దర్శించవచ్చని తెలిపారు.

### శాంతికి, ఆనందానికి ప్రతీక హంస

దేవ దేవుడు తన మనోనేత్రంతో లోకంలోని మంచి, చెడులను వేరు చేసే విధానికి ప్రతీకగా.. పాలను, నీటిని వేరు చేయగల హంస దివ్యవాహనంపై నరసింహ స్వామి భక్త జనులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 గంటలకు నిత్యకైంకర్యాల అనంతరం ప్రధానాలయంలోని కల్యాణ మండపంలో స్వామివారిని హంస వాహనంపై అధిష్టింపజేసి ప్రధానాలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగించారు. ఇతిహాసంలో, వేద శాస్త్రంలో హంసను జ్ఞానానికి ప్రతీకగా పేర్కొన్నారు. హంస శాంతికి, కీర్తికి, ఆనందానికి, అందానికి దిక్సూచి. హంస పక్షి జాతికి చెందినా భగవదనుగ్రహ విశేషం వల్ల రాజహంసగా పరమాత్మ వాహనంగా యోగ్యతను కలిగి ఉన్నదని ఆలయ అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, కార్యనిర్వహణాధికారి రామకృష్ణారావు, డీఈఓ దోర్బల భాస్కర్ శర్మ, ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, యజ్ఞాచార్యులు కిరణ్‌కుమారాచార్యులు, ముఖ్య అర్చకులు మంగళగిరి నరసింహమూర్తి, ఉప ప్రధానార్చకులు సురేంద్రాచార్యులు, భాస్కరాచార్యులు, మాధవాచార్యులు, సహాయ కార్యనిర్వహణాధికారి గజవెల్లి రఘు, పర్యవేక్షకులు సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఉత్తర మాఢ వీధుల్లో కల్యాణ వేదిక ముస్తాబు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 18న నిర్వహించే స్వామివారి తిరు కల్యాణ మహోత్సవానికి కల్యాణ వేదిక ముస్తాబువుతున్నది. ప్రధానాలయం ఉత్తర ప్రాంతంలోని వాయుదిశలో నిర్మించిన లిఫ్ట్, రథశాల ప్రాంతంలో కల్యాణ వేదికతోపాటు 3,500 మంది కూర్చునే విధంగా వీవీఐపీ, వీఐపీ, మీడియా, దాతలు, దేవస్థాన అధికారులు, డోనర్లు, కల్యాణంలో పాల్గొనే భక్తులకు వేర్వేరుగా ప్రత్యేకమైన లాబీలను ఏర్పాటు చేస్తున్నారు. కల్యాణ వేదికను 3 ఫీట్ల ఎత్తు, 42 వెడల్పు, 80 పొడవుతో తీర్చిదిద్దుతున్నారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని 10 వేల మంది వీక్షించే విధంగా కొండపైన 8 ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాట్లు చేస్తున్నారు. వేదిక ప్రాంతంలో 4, తూర్పు మాఢవీధుల్లో ఒకటి, క్యూ కాంప్లెక్స్ పైన ఒకటి, కొండపైన బస్టాండ్ ప్రాంతంలో 2 ఎల్‌ఈడీ స్క్రీన్లను అమర్చనున్నారు.



స్వామి వారికి నమస్కరిస్తున్న భక్తులు

### నేటి నుంచి రోజుకు 1500 మందికి భోజనం

బ్రహ్మోత్సవాలు తిలకించే భక్తులకు దేవస్థానం భోజన వసతి కల్పించనున్నది. ఇప్పటికే కొండకింద లక్ష్మీపుష్కరిణి చెంతన దీక్షాపరుల మండపంలో రోజుకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 500 మందికి భోజనాలు ఏర్పాటు చేయగా బ్రహ్మోత్సవాలు సందర్భంగా 1500 మందికి అందించనున్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం నేటి నుంచి ఈ నెల 21వరకు భక్తులకు అందుబాటులో ఉండనున్నది.

### నేటి నుంచి ధార్మిక, సాహిత్య కార్యక్రమాలు

యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులను అలరించేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో నేటి నుంచి 19 వరకు ధార్మిక సాహిత్య, సంగీత మహాసభలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఈశాన్య మాఢ వీధుల్లోని క్యూ లైన్ పక్కన తాత్కాలిక వేదికను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభాత భేరీ, నేటి నుంచి 20వ తేదీ వరకు ఆస్థానం వారిచే మంగళవాయిద్యం, వైదిక ప్రార్థనలు ఉంటాయి.

### నేడు శ్రీకృష్ణాలంకరణలో స్వామివారు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం లక్ష్మీనరసింహ స్వామి శ్రీకృష్ణాలంకరణ సేవలో (మురళీకృష్ణుడు) భక్తులకు దర్శనమివ్వనున్నారు. సాయంత్రం పొన్నవాహన సేవలో ఊరేగనున్నారు.



హుజూర్‌నగర్‌లో ఇండ్ల పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, స్పీకర్ ప్రసాద్, కలెక్టర్ వెంకట్రావ్

# నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు

- మంత్రులు పొంగు లేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- ఇందిరమ్మ ఇండ్ల పునరుద్ధరణ, బెట్టెతండా ఎత్తిపోతల పనులకు శంకుస్థాపన

హుజూర్‌నగర్/పాలకవీడు, మార్చి 14 : పేదల మేలు కోరేది కాంగ్రెస్ పార్టీ అని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని రామస్వామి గుట్ట వద్ద రూ.74 కోట్లతో ఇందిరమ్మ పట్టణ గృహ నిర్మాణ పథకం పునరుద్ధరణ పనులకు గురువారం వారు స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ 14 ఏండ్ల తర్వాత మోడల్ కాలనీ కల నెరవేరినందుకు ఆనందంగా ఉందన్నారు. రానున్న ఏడు నెలల్లో 2,160 ఇండ్లు, 2వేల సింగిల్ బ్రెడ్‌రూం ప్లాట్‌లను పేదలకు పంపిణీ చేస్తామని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి పేదలకు అందజేస్తామన్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల నాగార్జున సాగర్ , శ్రీ శైలం జలాశయంలో నీరు లేక కృష్ణా పరీవాహక ప్రాంతాల రైతులు ఇబ్బందులు పడుతున్నది వాస్తమేనని, దానిని నూతన ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపైన రుద్దడం సరికాదని తెలిపారు. అనంతరం కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన 400 మంది ఆటో డ్రైవర్లకు ఇన్సూరెన్స్ పత్రాలను మంత్రులు అందజేశారు. ఆ తర్వాత పాలకవీడు మండలంలోని బెట్టె తండాలో రూ.33కోట్లతో ఏర్పాటు చేయనున్న లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ఇద్దరు మంత్రులు, స్పీకర్ శంకుస్థాపన చేశారు. లిఫ్ట్ పనులు పూర్తయితే 2వేల ఎకరాలు సాగులోకి వస్తాయని మంత్రులు తెలిపారు. కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే, ఆర్డీఓ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనారవి, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, తాసీల్దార్లు నాగార్జున, మంగ, కవిత, పాలకవీడు ఎంపీపీ గోపాల్, జడ్పీటీసీ మోతీలాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న, నాయకులు నాగన్న, శ్రీనివాస్, సౌజన్య, మంజుల, నాగేశ్వర్‌రావు, సతీశ్, గాయత్రి భాస్కర్, మల్లికార్జున్, సుబ్బారావు, రవినాయక్, దొంగరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




శాలిగౌరారం : ప్రస్తుతం నీళ్లు లేక అడుగంటిన ఎన్జీ కొత్తపల్లి చెరువు

## అడుగంటిన కొత్తపల్లి చెరువు

వేసవి ప్రారంభంలోనే చెరువులు ఎండిపోతున్నాయి. గతేడాది మార్చి నెలలో నీటితో కళకళలాడిన శాలిగౌరారం మండలంలోని ఎన్జీకొత్తపెల్లి చెరువు ప్రస్తుతం అడుగంటి పోయింది. భూగర్భ జలాలు అడుగంటి సాగునీటికి ఇప్పటికే ఇబ్బందిగా మారగా రానున్న ఎండలతో పశుపక్షాదులకు గడ్డు పరిస్థితులు తప్పేలా లేవు. –శాలిగౌరారం, మార్చి 14




గతేడాది మార్చిలో అలుగు పోస్తున్న ఎన్జీ కొత్తపెల్లి చెరువు



సూర్యాపేటలో కేరింతలు కొడుతున్న విద్యార్థినులు

# టాటా.. బైబై..

- ముగిసిన ఇంటర్ పరీక్షలు
- పరీక్ష కేంద్రాల వద్ద సెల్ఫీలు దిగిన విద్యార్థులు

రామగిరి మార్చి 14 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు గురువారం ముగిశాయి. గురువారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు చివరి పరీక్ష రాశారు. ఈ సందర్భంగా తమ స్నేహితులతో కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగారు. మళ్లీ కలుద్దామని వీడ్కోలు చెప్పుకొన్నారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు తమ సామగ్రి తీసుకొని ఇంటి బాట పట్టారు.


ఈ నెల 16 నుంచి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమవుతుందని డీఐఈఓ దస్రూనాయక్ వెల్లడించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం పొలిటికల్ సైన్స్‌కు సంబంధించి మూల్యాంకన ఉత్తర్వులు పొందిన అధ్యాపకులు ఉదయం 9 గంటల లోపు మూల్యాంకన కేంద్రం నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ ప్రభుత్వ బాలల జూనియర్ కళాశాలలో రిపోర్ట్ చేయాలని ఆయన సూచించారు. వేసవి దృష్ట్యా మూల్యాంకన కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేశామని డీఐఈఓ తెలిపారు.



నల్లగొండలో సెల్ఫీదిగుతున్న విద్యార్థినులు

# వేతన వెతలు

- ఉపాధి హామీ ఉద్యోగులకు మూడు నెలలుగా అందని జీతాలు
- కుటుంబ అవసరాలకు తీవ్ర ఇబ్బందులు
- బడ్జెట్‌లో కేటాయింపు లేకపోవడమేనంటున్న ఉద్యోగులు



సూర్యాపేట, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : ఉపాధి హామీ పథకంలో భాగస్వాములై గ్రామీణ ప్రాంత కూలీలకు పని కల్పించే ఉద్యోగులు, సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు రావడం లేదు. బీఆర్‌ఎస్ సర్కారులో వేతనాలకు ఇబ్బందులు లేకపోగా డిసెంబర్ నుంచి ఆగిపోవడంతో వారికి ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో సుమారు 434 మంది వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. అందరూ జీతాలపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటుండగా, మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో జీవనం కష్టంగా మారింది. అప్పులు చేసి కాలం వెళ్లదీసే పరిస్థితి నెలకొన్నది. బడ్జెట్ కేటాయింపులు లేకనే వేతనాలు నిలిచిపోయినట్లు తెలుస్తుంది.

### ప్రభుత్వం నిర్లక్ష్యం..

గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించి స్థానికంగానే ఉపాధి కల్పించే లక్ష్యంతో చేపడుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సత్ఫలితాలను ఇస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇందులో కార్యాలయాల్లో పని చేసే వారితో పాటు ఫీల్డ్‌పై విధులు నిర్వర్తించే సహాయ ప్రాజెక్టు అధికారులు, ఇంజినీర్లు, ప్లాంటేషన్ మేనేజర్లు, ప్లాంటేషన్ సూపర్‌వైజర్లు, జిల్లా అదనపు రిసోర్స్ పర్సన్లు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, క్షేత్ర సహాయకులు, ఇతర ఔట్ సోర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారు. ఏడాదికి సరిపడా ప్రణాళికలు సిద్ధం చేసి లక్ష్యం చేరేలా కూలీలకు పనులు కల్పించడం, కొలతలు తీయడం, పరిశీలించడంతోపాటు వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చడం, హరితహారం వంటి పనులతో తీరిక లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరందరికీ వేతనాలు ఇవ్వడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని కనబర్చుతున్నది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రతి నెల 10వ తేదీలోపే ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమ అయ్యేవి. కాంగ్రెస్ ప్రభుత్వంలో మూడు నెలలుగా జీతాలు లేకపోవడంతో ఉద్యోగులు, సిబ్బంది ఇంటి అద్దెలు, ఈఎంఐలు కట్టలేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే వేతనాలను విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

# మైనింగ్ శాఖలో బదిలీలు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురికి స్థాన చలనం
- ఏడీల నుంచి రాయల్ ఇన్‌స్పెక్టర్స్ వరకు ట్రాన్స్‌ఫర్స్

నల్లగొండ, మార్చి 14 : పరిశ్రమల శాఖలో డిప్యూటీ డైరెక్టర్స్ నుంచి రాయల్ ఇన్‌స్పెక్టర్స్ వరకు పని చేస్తున్న అధికార యంత్రాంగానికి ప్రభుత్వం స్థాన చలనం కల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా మైనిగ్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న డిప్యూటీ డైరెక్టర్స్, అసిస్టెంట్ డైరెక్టర్స్, అసిస్టెంట్ జియాలజిస్టులతో పాటు రాయల్టీ ఇన్‌స్పెక్టర్స్‌ను బదిలీ చేస్తూ మైనింగ్ అండ్ జియాలజీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బెనహర్ మహేష్ దత్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడీల నుంచి ఆర్‌ఐల వరకు ఏడుగురు అధికారులు ఇతర జిల్లాలకు ట్రాన్స్‌ఫర్ కాగా ఇతర జిల్లాల నుంచి మన జిల్లాకు తొమ్మిది మంది అధికారులు బదిలీపై వచ్చారు. వెంటనే ప్రస్తుతం పని చేస్తున్న స్థానాల్లో రిలీవ్ అయి కొత్త స్థానాల్లో జాయిన్ కావాలని ఆదేశించారు.

### బదిలీల వివరాలు

| పేరు | హోదా | ప్రస్తుతం పని చేస్తున్నది | బదిలీ అయినది |
|---|---|---|---|
| స్వామి కృష్ణాజీ రావు | ఏడీ | సూర్యాపేట | హైదరాబాద్ |
| రఘునందన్ రెడ్డి | ఏడీ | మహబూబాబాద్ | సూర్యాపేట |
| సామ్యూల్ జాకబ్ | ఏడీ | వికారాబాద్ | నల్లగొండ |
| రాఘవరెడ్డి | ఏడీ | సిద్దిపేట | యాదాద్రి భువనగిరి |
| లక్ష్మిప్రసాద్ | ఏజీ | యాదాద్రి భువనగిరి | నిర్మల్ |
| వెంకటేశ్వర్ రావు | ఏజీ | నల్లగొండ | కరీంనగర్ |
| రవికుమార్ | ఏజీ | పెద్దపల్లి | యాదాద్రి భువనగిరి |
| విజయ రామారాజు | ఏజీ | జోగులాంబ గద్వాల | సూర్యాపేట |
| బాలు | ఏజీ | మంచిర్యాల | నల్లగొండ |
| వసుమతి | ఆర్‌ఐ | గద్వాల | సూర్యాపేట |
| కృష్ణం రాజు | ఆర్‌ఐ | సూర్యాపేట | హైదరాబాద్ |
| ఆనంద్‌కుమార్ స్టీఫెన్సన్ | ఆర్‌ఐ | ఆదిలాబాద్ | నల్లగొండ |
| విజయభారతి | ఆర్‌ఐ | హైదరాబాద్ | యాదాద్రి భువనగిరి |
| అనిత | ఆర్‌ఐ | యాదాద్రి భువనగిరి | జనగాం |
| నాగమణి | ఆర్‌ఐ | నల్లగొండ | మేడ్చల్ మల్కాజ్ గిరి |
| వెంకటరమణ | ఆర్‌ఐ | సూర్యాపేట | జోగులాంబ గద్వాల |

# ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం

- సూర్యాపేట జిల్లాలో 3.54 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- 281 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ఈ నెల చివరి వారంలో ప్రారంభం



సూర్యాపేట, మార్చి 14 : యాసంగి వరి ధాన్యం సేకరణకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతున్నది. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 281 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 3.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయించింది. మార్చి చివరి వారంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

### 3,85,459 ఎకరాల్లో వరి సాగు

జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 3,85,459 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో సన్న రకం ధాన్యం 3,82,518 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 5,00,815 మెట్రిక్ టన్నులు కలిపి సుమారు 8,83,333 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి అవుతుందని అధికారులు అంచనా వేశారు. లోకల్ మార్కెట్ యార్డుల్లో అమ్మకాలు, మిల్లర్ల కొనుగోళ్లు, రైతుల అవసరాలు పోగా దాదాపు 5,07,721 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉండగా 3,54,896 మెట్రిక్ టన్నులు సేకరించనున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 281 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా వీటిలో 183 ఐకేపీ కేంద్రాలు, 98 పీఏసీఎస్ కేంద్రాలు ఉన్నాయి. 475 గ్రామ పంచాయతీల పరిధిలో రైతులకు అందుబాటులో ఉండే విధంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని జిల్లాలోని 80 మిల్లులకు సీఎంఆర్ కోసం తరలించనున్నారు. ధాన్యం నింపేందుకు 90 లక్షల గన్నీ బ్యాగులు అవసరం ఉండగా ఇప్పటికే జిల్లాలో 39 లక్షల బ్యాగులు సిద్ధంగా ఉన్నాయి. కొనుగోలు కేంద్రాల ప్రారంభం నాటికి మిగతా వాటిని తీసుకొచ్చేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం గ్రేడ్–ఏ రకానికి రూ. 2,203 , కామన్ రకానికి రూ. 2,183 చెల్లించనున్నారు.

### లక్ష్యం చేరడం కష్టమే..

యాసంగిలో 3.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయించినా లక్ష్యం చేరేలా కనిపించడం లేదు. ఇప్పటికే జిల్లాలో కరువు చాయలు కనిపిస్తున్నాయి. పంటలు ఎండిపోతుండడంతో రైతులు వాటిని కాపాడుకునేందుకు చేయని ప్రయత్నం లేదు. సాగర్ ఎడమ కాల్వ నుంచి సాగు నీరు వదలక పోవడంతో ఇప్పటికే ఆ ప్రాంతంలో వరి సాగు తగ్గింది. శ్రీరాం సాగర్ కాల్వలకు కాళేశ్వరం జలాలు రాక పోవడంతో తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజక వర్గాల్లో సైతం వరి సాగు ఆశించినంత లేదు. 2022–23 యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 4,62,709 ఎకరాల్లో వరిసాగు చేయగా ఈ సారి 3,82 లక్షల ఎకరాలకే పరిమితమైంది. దాదాపు 80 వేల ఎకరాల్లో సాగు తగ్గింది. దాంతో రైతులు ధాన్యం అమ్మడానికి ముందుకు వస్తారా అనేది అనుమానంగా ఉన్నది. 3.54 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం అనుకున్నా రెండు లక్షల మెట్రిక్ టన్నులు దాటితే చాలు అనే విధంగా అధికారులు అంచనా వేస్తున్నారు.

## డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

నల్లగొండ, మార్చి 14 : డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్సీ అభ్యర్థులకు నల్లగొండలోని ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు ఉచిత వసతితో శిక్షణ నిర్వహిస్తున్నందున అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని నల్లగొండ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఎల్. శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ, యాదాద్రి–భువనగిరి జిల్లాలకు సంబంధించి టీటీసీ లేదా బీఈడీ పూర్తి చేసి టెట్‌లో అర్హత సాధించిన 100 మంది అభ్యర్థులను మెరిట్ ఆధారంగా ఎంపిక చేసి, రెండు నెలల పాటు ఉచిత వసతితోపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. శిక్షణ ఏప్రిల్ 3, 2024 నుంచి జూన్ 2, 2024 ఉంటుందని, అర్హులైన అభ్యర్థులు ఈ నెల 26 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు http://.tsscstudycircle.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 8465035932, 9603167257, 9010895239 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## యంగ్ ప్రొఫెషనల్ ఉద్యోగానికి దరఖాస్తులు

త్రిపురారం, మార్చి 14 : మండలంలోని కంపసాగర్ కేవీకేలో నల్లగొండ జిల్లా పరిధిలో పని చేయడానికి యంగ్ ప్రొఫెషనల్స్ ఉద్యోగానికి జిల్లాలోని ఎమ్మెస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ అగ్రికల్చర్, డిప్లొమా అగ్రికల్చర్ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐసీఏఆర్, ఎన్‌బీఎస్ఎస్, ఎల్‌యూపీ ఆధ్వర్యంలో పంట వైవిధ్యం అనే ప్రాజెక్టులో భాగంగా పనిచేయాల్సి ఉంటుందని, నెలకు వేతనం రూ.25వేలు ఇస్తారని పేర్కొన్నారు. దరఖాస్తు చేయాలనుకునే అభ్యర్థులు ఈ నెల 18లోపు కేవీకేలో దరఖాస్తు అందించాలని, ఇంటర్వ్యూ తేదీని తదనంతరం తెలియచేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 7702544771 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.